క్లుప్తంగా

చీరాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు స్వచ్ఛత అవార్డు


స్వచ్ఛత అవార్డును అందుకుంటున్న డిపో మేనేజర్ శ్యామల

చీరాల అర్బన్: చీరాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు స్వచ్ఛత అవార్డు దక్కింది. సోమవారం రాత్రి కేంద్రమైన బాపట్లలో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛత అవార్డును కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్యామల అందుకున్నారు. చీరాల ఆర్టీసీ బస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్వచ్ఛభారత్‌లో భాగంగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయడం, ఎప్పటికప్పుడు చెత్త చెదారం లేకుండా చేస్తున్నామన్నారు. అలానే స్వీపర్లతో పాటు అదనంగా మరో స్వీపర్‌ను నియమించి చెత్తను తొలగించామన్నారు. చెత్తాచెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచామన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలో చీరాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు స్వచ్ఛత అవార్డును అందించారని డిపో మేనేజర్ జె.శ్యామల తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

చీరాల అర్బన్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి 216 జాతీయ రహదారిపై తోటవారిపాలెం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీరాల రూరల్ మండలం తోటవారిపాలెం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన రత్నం, డానియేల్‌లు ద్విచక్రవాహనంపై 216 జాతీయ రహదారిపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు వీరిని ఢీకొట్టింది. కారు వేగం అదుపుకాక పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరిలో రత్నంకు మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

ఇది దేశ గౌరవ ప్రతిష్టలపై దాడి

పర్చూరు(చినగంజాం): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి అంటే అది భారత దేశ గౌరవ ప్రతిష్టలపై దాడి వంటిదని రాష్ట్ర వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శి మాచవరపు రవికుమార్ మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అంటే మన దేశ రాజ్యాంగానికి రక్షకుడన్నారు. న్యాయం కోరే ప్రతి పౌరుడి చివరి ఆశ్రయం సుప్రీం అని, అక్కడే మన హక్కులు, స్వేచ్ఛలు రక్షింపబడతాయని పేర్కొన్నారు. న్యాయ స్థానాల ద్వారా దేశంలో న్యాయం బ్రతికుందన్న విశ్వాసం ప్రతి పౌరుడికి కలుగుతుందన్నారు. అలాంటి మహత్తరమైన సంస్థకు నాయకత్వం వహిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై ఆర్ఎస్ఎస్ మతోన్మాద వర్గాలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఏకాభిప్రాయం


అంగీకారం తెలిపిన దేగరమూడి గ్రామస్తులు

మార్టూరు: మండలంలోని దేగరమూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామ ప్రజలందరూ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు గ్రామస్తులు మంగళవారం ఆర్డీఓ, డీఎస్పీలకు వినతి పత్రం అందజేశారు. దేగరమూడి గ్రామంలో గల గ్రామ కంఠం సర్వే నంబర్162లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అన్ని వర్గాలు, కులాలు వారికి ఆమోదయోగ్యం అని వారు తమ అంగీకార పత్రంలో తెలియపరిచారు. జె. శ్రీనివాసరావు, జె. పున్నయ్య, బి. సామ్యేలు, ఎం. సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం


బాలిక బరువు పరిశీలిస్తున్న అయోగ్ సభ్యుడు జోసఫ్ మిరాకిల్

జె.పంగులూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, తల్లులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారని వీటిని ఉపయోగించుకొని మంచి ఆరోగ్యంతో పాటు పిల్లలకు చదువులు కూడా నేర్పించాలని నీతి ఆయోగ్ టీ పోషన్ ట్రాకర్ 2.0 సభ్యులు జోసఫ్ మిరాకిల్ అన్నారు. రామకూరులో గల అగన్‌వాడీ -3 కేంద్రాన్ని మంగళవారం నీతి ఆయోగ్ టీ సభ్యులు జోసఫ్ మిరాకిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా సోసప్ మిరాకిల్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మంచి పుష్టికరమైన ఆహారం అందిస్తుందన్నారు. సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు టి. తులసి, ఆయా పద్మ పాల్గొన్నారు.

అటకెక్కిన గ్రామ స్వరాజ్యం

- సర్వేల భారంతో సచివాలయ ఉద్యోగులు సతమతం
- గతంలో వలంటీర్ల సేవలూ వీరితోనే నిర్వహణ
- పోరుబాటలో ఉద్యోగులు


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)

చీరాల అర్బన్: గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన సచివాలయ ఉద్యోగులు నేటి తమ పరిస్థితి తలచుకుని కుమిలిపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా కాకుండా బానిసలుగా చూస్తూ సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. వలంటీర్లు చేయాల్సిన పనులను తమతో చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వంపై నిరసనగళం వినిపిస్తున్నారు. తమపై మోపిన విధుల భారాన్ని తగ్గించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే పక్షంలో ఉద్యమబాట పట్టేందుకు ఇప్పటికే సిద్ధమయ్యారు. ఇప్పటికే రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పట్టణ, రూరల్ గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు అధికారులకు వినతిపత్రాలు అందించారు.

వందలాదిమంది..

చీరాల నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, రూరల్ మండలం, వేటపాలెం మండలాలున్నాయి. చీరాల మున్సిపాలిటీలో 25 వార్డు సచివాలయాలు ఉండగా వీటిలో 164 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. చీరాల రూరల్ మండలంలోని 22 సచివాలయాల్లో 184 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అలానే వేటపాలెం మండలంలో 19 సచివాలయాల్లో 170 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వ్యయప్రయాసలతో ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. రాజకీయ జోక్యం, అవినీతి, అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల నియామకాలను చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రెండు వేలు, పట్టణ ప్రాంతాల్లో నాలుగు వేల మంది జనాభా ప్రాతిపదికన వార్డు సచివాలయాలను కేటాయించారు. సచివాలయ సెక్రటరీ, ఇంజినీరింగ్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, వెటర్నరీ, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, విలేజ్ సర్వేయర్ తదితర ఉద్యోగులున్నారు. వీరి ద్వారా 500కు పైగా సేవలు అందుబాటులోకి తెచ్చారు.

సచివాలయ ఉద్యోగులపై భారం

ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను అచేతనావస్థలో ఉంచడంతో సచివాలయ ఉద్యోగులపై భారం పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి 50 ఇళ్ళకు ఒక వలంటీర్‌ను ఉంచి ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు, కార్యక్రమాలను అమలు చేసేవారు. సచివాలయ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్లు నిర్వహించే పనులు కూడా సచివాలయ ఉద్యోగులపై భారం పడింది.

ప్రజలకు చెందిన సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం, ఆధార్ బయోమెట్రిక్ వివరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాల సేకరణతో భారం అధికమైంది. ఉద్యోగులు తమ శాఖకు సంబంధించిన పనులే కాకుండా సంబంధం లేని పనులను కూడా చూడాల్సిన పరిస్థితి వచ్చింది. హౌస్‌హోల్డ్, ఎంఎస్ఎం తదితర సర్వేల పేరిట ఇంటింటికీ తిప్పుతూ వెట్టి చాకిరీ చేయిస్తోంది. వాట్సాస్ గవర్నెస్ అవగాహన సర్వేలు నిర్వహించాలని చెప్పడంతో కొంతమంది వాట్సప్ గ్రూపుల నుంచి బయటకు వచ్చేశారు. ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే వలంటీర్ విధులను బహిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దశల వారీగా అధికారులకు వినతిపత్రాలు అందించారు. తాజాగా జీఎస్టీ తగ్గింపు చేయడంతో ప్రతి ఇంటికి జీఎస్టీ తగ్గింపు వలన ఎంత మేలు జరిగిందో తెలియచెప్పేందుకు మూడు వారాల పాటు జీఎస్టీ తగ్గింపు సంబరాల కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పడం చూస్తే సచివాలయ ఉద్యోగులకు దసరా ధమాకా అందించినట్లుగా ఉంది.

డిమాండ్లు ఇవే...

- ఆరేళ్ల ఒకే క్యాడర్‌లో సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని
- ప్రొబేషనరీ సమయంలో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లకు స్పష్టమైన టైమ్‌టైమ్ నిర్ణయించాలి.
- సర్వేలను ఆయా శాఖల సంబంధిత ఉద్యోగులతో నిర్వహించి సచివాలయ సిబ్బందిపై భారం తగ్గించాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలి.
- విద్యార్హతల ఆధారంగా సచివాలయ ఉద్యోగులకు విధులు అప్పగించాలి.
- ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి తప్పించాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వారి మాతృశాఖలకు అప్పగించాలి.
- సమయపాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కలిగించాలి. సెలవులు, ఆదివారాలు, పండుగ సమయాల్లో విధులు చేయించకూడదు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి


అనంతవరంలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యద్దనపూడి: జీఎస్టీ పన్నులు తగ్గింపుపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ పన్నులు తగ్గింపు వల్ల కుటుంబానికి నెలకు రూ.1000 నుంచి రూ. 1500 వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. సరుకులు, ప్యాకేజ్‌డ్ ఫుడ్స్, ఆరోగ్య సంబంధింత సామగ్రి, బేకరీ ఉత్పత్తులు, బైకులు, కార్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, రైతులకు సంబంధించిన ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పరికరాలకు సంబంధించిన జీఎస్టీ పన్నులు గణనీయంగా తగ్గాయని సూచించారు. ఈ విషయంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో ముచ్చటించి బోధన తీరుతెన్నులపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డీఈఓ పురుషోత్తం, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిరెడ్డి, చీరాల డిప్యూటీ డీఈఓ గంగాధర్, ఎంఈఓ పుల్లెల సుబ్రమణ్యేశ్వరరావు, ఎంఈఓ-2 చిలుకూరి గోపి, ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధి లక్ష్యం కావాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

పర్చూరు(చినగంజాం): మండల స్థాయిలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మేకా ఆనందకుమారి కోరారు. మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలోని సమావేశం హాలులో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలపై సత్వరం స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కారం చూపాలన్నారు. వ్యవసాయాధికారి కె. భాస్కరరావు మాట్లాడుతూ మండలంలో రైతులకు ఎరువుల కొరత ఏమీ లేదని, రైతులు అవసరానికి మించి ఎరువులు నిలువ చేయొద్దని సూచించారు. పొగాకు పంటను పూర్తిగా ప్రభుత్వం నిషేధించిందని రైతులెవరూ పొగాకు సాగు చేయొద్దని సూచించారు. పొగాకు కొనుగోలు షెడ్యూల్ నిర్వహించినప్పుడు రాలేని రైతులు కూడా తమ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని సూచించారు. మండలంలో సాగు చేసిన రైతులు తమ పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం అందించే రాయితీలు, గిట్టుబాటు ధరలు వర్తిస్తాయన్నారు. ఇదే విషయం కౌలు రైతులకు కూడా వర్తిస్తుందని అన్నారు. పశు సంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ అరుణ మాట్లాడుతూ పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలన్నారు. ముద్ద వ్యాధికి సంబంధించిన వ్యాక్సిన్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. అవసరమైన రైతులకు రాయితీపై దాణా అందజేస్తామని చెప్పారు. ఎంఈఓ 1 శివకోటేశ్వరరావు మాట్లాడుతూ బడి ఈడు ఉన్న పిల్లలు బడి బయట ఉండకూడదన్నారు. మధ్యలో బడి మానివేసిన పిల్లలను కూడా ప్రభుత్వం చదివిస్తున్నట్లు తెలిపారు. పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం లాంటి పథకాలను విద్యార్థులకు అందజేస్తున్నట్లు వివరించారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, ఏఈపీఆర్ శ్రీనివాసరావు, సీడీపీఓ సుభద్ర, హౌసింగ్ ఏఓ రామకృష్ణ, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం


బల్లికురవ కేజీబీవీలో యోగాపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్


యోగా చేస్తున్న బాలికలు

బల్లికురవ: విద్యార్థులు చదువుతో పాటు రోజుకు గంటపాటు యోగా చేస్తే ఆరోగ్యవంతులుగా జీవించగలుగుతారని బల్లికురవ కస్తూర్బా గాంధీ గురుకుల బాలిక విద్యాలయం ప్రిన్సిపాల్ కె. సరళ కుమారి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం యోగాపై బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ప్రియ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలి మానసిక పరివర్తన యోగాతో చేకూరతాయన్నారు. విద్యాలయంలో తరగతులకు వెళ్లే లోపు ఉదయమే చేయాలన్నారు. మానసిక ఆరోగ్యానికి మద్దతుగా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడం ప్రధాన లక్ష్యం అన్నారు. అవగాహనలో భాగంగా బాలికలచే పలు యోగా భంగిమలపై సాధన చేయించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

కారంచేడు: ప్రజా సమస్యలను గుర్తించి వాటి సత్వర పరిష్కారానికి చిత్త శుద్ధితో పనిచేయాలని బాపట్ల కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం యద్దనపూడి పర్యటన ముగించుకొని బాపట్ల వెళ్ళే మార్గమధ్యంలో కారంచేడు తహసీల్దారు కార్యాలయంలో కొద్ది సేపు ఆగి జిల్లా స్థాయి అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీసీకి ముందుగా ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయం పరిశీలించి పలు సమస్యలపై ఆయన తహసీల్దారుతో మాట్లాడారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. మొదటి విడతలో జిల్లాలో 406 సామాజిక మరుగుదొడ్లు మంజూరయ్యాయన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తున్నామన్నారు. తహసీల్దారు కార్యాలయం ఎదురుగా నివాసాలు ఉంటున్న ప్రజలు కలిసి డ్రైనేజ్ సమస్యపై అర్జీలు అందించారు. సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. బాపట్ల టూరిజం ఆఫీసర్ నాగిరెడ్డి, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, బాపట్ల డీఈఓ పురుషోత్తం, డిప్యూటీ డీఈఓ పి. సుబ్రమణ్యేశ్వరరావు, తహసీల్దారు నాగరాజు పాల్గొన్నారు.

మొబైల్ షాపుల ఆకస్మిక తనిఖీ

అద్దంకి రూరల్: జిల్లా కొలతలు, తూనికల శాఖ అధికారి నాగేశ్వరరావు మంగళవారం అద్దంకి పట్టణంలోని మొబైల్ షాపులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు షాపుల్లో కంపెనీలు నిర్ణయించిన ఎమ్మార్పీ ధరల కంటే అధికధరలకు అమ్ముతున్న నాలుగు షాపులకు అదనపు రుసుం విధించారు.

లక్ష తమలపాకుల పూజ



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. అనంతరం మహానివేదన, పంచాహారతులు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఉభయదాతలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వరి పొలాలు ఎండిపోవడంపై ఆందోళన


రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి

చీరాల రూరల్: వేటపాలెం మండలాలలోని పాపాయిపాలెంలో సాగుచేస్తున్న వరిపంట పొలాలు ఎండిపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారికి మద్దతుగా మంగళవారం వైఎస్సార్ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి ఆయా పంట పొలాలను సందర్శించి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ వ్యవసాయాధికారుల్లో ఏమాత్రం చలనం ఉండడం లేదన్నారు. వ్యవసాయాధికారులు తూతూ మంత్రంగా పొలం బడులు నిర్వహించి ఫొటోలు తీసుకుంటున్నారేకానీ రైతులు వ్యవసాయంలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలు, సూచనలు, సలహాలను అందించడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే యూరియా అందక రైతులు ఒక పక్క ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నెల రోజులు క్రితం రైతులందరూ వరి ఎదబెట్టారని నెల దాటిన తరువాత ఆయా పొలాలన్ని ఎండిపోతున్నాయని చెప్పారు. ఎండిన పొలాలను మరలా దున్ని దూర ప్రాంతాల నుంచి నారుతెచ్చి నాట్లువేసినా ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధంగా ఎందుకు జరుగుతుందో రైతులకు అర్థం కావడం లేదని దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. భూమిలో ఏదైనా తేడాలు ఉన్నాయా, పొలాలకు వాడే నీటివలన తేడాలు వస్తున్నాయా అనే విషయాలను వ్యవసాయాధికారులు పంట పొలాలను పరిశీలించి భూ పరీక్షలు నిర్వహించి, రైతులకు నివారణకు సూచనలు అందించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా వాల్మీకి జయంతి


పమిడిపాడులో జెండాను ఆవిష్కరిస్తున్న వాల్మీకి సోదరులు

మేదరమెట్ల:

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామంలో మంగళవారం వాల్మీకి సోదరులు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యక్రమం అలాగే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో వాల్మీకి జయంతి

చీరాల రూరల్: చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) టి. చంద్రశేఖర నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని తన కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన సిబ్బందితో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించేందుకు ఉత్తర్వులు జారిచేసినట్లు చెప్పారు. వాల్మీకి రామాయణాన్ని రచించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.

చీరాల రూరల్: వాల్మీకి సంక్షేమ సంఘం చీరాల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వహించారు.


వాల్మీకి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ముఖ్య అతిధులుగా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) టి. చంద్రశేఖర నాయుడు, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు మాట్లాడారు. అయోధ్య బలరాముని విగ్రహ యంత్రరూపకర్త డాక్టర్ అన్నదానం చిదంబర శాస్త్రి, ఆధ్యాత్మిక పీఠం ప్రెసిడెంట్ ఊటుకూరి వెంకటరావు, ఏఎంసీ చైర్మన్ కొత్తవరపు జనార్ధనరావు, బి. వెంకటకృష్ణ శక్తిధర్, కామినేడి రామకృష్ణ, ఇరపని సాంబశివరావు, కె. శివ చైతన్య, వి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలి


కరపత్రాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చీరాల రూరల్:

క్షయవ్యాధిపై వైద్య సిబ్బంది విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని మరియమ్మపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శిరీష పేర్కొన్నారు. ఆషా డే సమావేశాన్ని మంగళవారం మరియమ్మపేటలోని పీహెచ్‌సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష ఆశ సిబ్బందితో కరపత్రాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్షయ అంటువ్యాధని వ్యాధిని ముందుగా గుర్తించి వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకున్నట్లయితే పూర్తిగా తగ్గిపోతుందని చెప్పారు. సిబ్బంది ఎం. ప్రసాద్, ఆనంద్, శ్రీలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

పర్చూరు(చినగంజాం): మండలంలోని ఉప్పుటూరులో ఉన్న రాజగోపుర మహా సంప్రోక్షణ శిలాఫలకంలో సర్పంచ్ పేరు ఉందంటూ గ్రామంలోని కొందరు మంగళవారం ఆ శిలాఫలకాన్ని పగులగొట్టారని సర్పంచ్ యర్రాకులు తిరుమలేశ్వరరావు ఆరోపించారు. ఉప్పుటూరు గ్రామంలో ఈ నెల 12వ తేదీ జీర్ణోద్ధరణ రాజగోపుర మహా సంప్రోక్షణ జరగనున్న నేపథ్యంలో దేవాదాయ శాఖాధికారులు ఆలయ ప్రాంగణంలో శిలాఫలకం ఏర్పాటు చేశారు. గ్రామంలో నిర్వహించే ప్రతి అధికారిక కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం పరిపాటి. కానీ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.

సర్వసభ్య సభ్య సమావేశం మమ

జె.పంగులూరు: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తేళ్ళ నాగమ్మ ఆధ్వర్యంలో, ఎంపీడీఓ కె. స్వరూపారాణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని మమ అని పించారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతి నిధులు ఎక్కువ మంది హాజరు కాలేదు. సమావేశానికి వచ్చిన అతి కొద్ది మంది అధికారులు వారి శాఖకు సంబంధించిన నివేదికలు చదివి వినిపించారు.

అలవలపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ గౌరవ వేతనం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.